నేటి దినపత్రిక
18వ
సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,5 ఏప్రిల్ 2025 8 పేజీలు

### ఇనిస్ట్రో ఒలంపియాడ్‌లో

## కైకలూరు శ్రీ చైతన్య విద్యార్థుల హవా



**కైకలూరు,మేజర్‌న్యూస్:** స్థానిక కైకలూరు శ్రీ చైతన్య స్కూల్లో నిర్వహించిన ఇనిస్ట్రో ఒలంపియాడ్ లెవెల్ 2లో కైకలూరు శ్రీ చైతన్య విద్యార్థులు తమ సత్తా చాటారు. ఇనిస్ట్రో వారు ప్రకటించిన లెవెల్ టు ఫలితాలలో లెనోవో లాప్టాప్ కన్నా రేవతి కృష్ణ,లెనోవో టాబ్ ఆర్ నిత్య, స్మార్ట్ వాచ్ 2, నాయిస్ స్మార్ట్ వాచ్లు 3, క్యాబ్ బెల్ట్ పౌచెస్ 3 ,గిఫ్ట్ బాక్స్ 4,స్పెషల్ ప్రైస్ 8, కన్సోలేషన్ ప్రైస్66సాధించి విజయకేతన ఎగర వేశారు.పాఠశాల ప్రిన్సిపల్ డిసురేంద్ర మాట్లాడుతూ కైకలూరు శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని దానికి కారణం స్కూల్లో నిర్వహించేటువంటి ఎకడమిక్ ప్రోగ్రామ్ అని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో పశ్చిమగోదావరి జిల్లా ఏటీఎం ఎస్ పార్థసారధి, ఏలూరు రీజనల్ ఇంచార్జ్ సిహెచ్ ఉదయభాస్కర్, జోనల్ అకాడమిక్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, ఏవో పి దానయ్య, పాఠశాల డీన్‌పీ నరేష్ కుమార్, పాఠశాల సి.ఇంచార్జ్ జివిన్‌బాబు,ప్రైమ్ ఇన్చార్జ్ కే స్వర్ణలత,పాల్గొన్నారు.

# ఆయన సేవలు 'అనంతం'

- రాజు వేగేశ్న ఫౌండేషన్ చైర్మన్ అనంత కోటిరాజుకు ప్రముఖుల ప్రశంసలు
- రూ.34 కోట్లుతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- హాజరైన కేంద్ర మంత్రి వర్మ ,డిప్యూటీ స్పీకర్ రఘురామ, మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే ధర్మరాజు







**గణపవరం,మేజర్‌న్యూస్ :** సమాజాభివృద్ధికి రాజు వేగేశ్న ఫౌండేషన్ చైర్మన్ వేగేశ్న అనంత కోటిరాజు అందిస్తున్న సహకారం ఎనలేనిదని ఆయన సేవలను పలువురు ప్రముఖులు కొనియాడారు. 2002లో వేగేశ్న ఫౌండేషన్ స్థాపించి గత 23 ఏళ్లలో రూ.100ల కోట్లు వెచ్చించి లెక్కలేనన్ని సేవా కార్యక్రమాలు చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు.రాజు వేగేశ్న ఫౌండేషన్ ద్వారా గణపవరంలో రూ.20 కోట్లు వ్యయంతో అభివృద్ధి చేసిన మంచినీటి చెరువు, రూ.15 కోట్లుతో జగన్నాధపురం,చినరామచంద్రపురం గ్రామాలవారికి మంచినీటి చెరువు, అత్యాధునిక ఆర్ఓ వాటర్ ప్లాంట్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.15 లక్షలతో జగన్నాదపురంలోని మండల పరిషత్ పాఠశాలకు అధనపు తరగతి గది,కాంపౌండ్ వాల్ ప్రారంభోత్సవ వేడుకలు శుక్రవారం జరిగాయి. చైర్మన్ వేగేశ్న అనంత కోటిరాజు,ఆయన సతీమణి బాల సరస్వతి,కుమార్తె శ్రీవాణిఆధ్వర్యంలో జరిగాయి.ప్రారంభోత్సవ వేడుకలు అనంతరం గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్న అనంత కోటిరాజును గ్రామస్తులు పిప్పర రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో భారీ ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మెల్యే ధర్మరాజు అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సమాజంలో సంపన్నులు ఎంతోమంది ఉన్నారని,కొంతమంది మాత్రమే సమాజం పట్ల బాద్యతగా పని చేస్తుంటారన్నారు. అటువంటి వారిలో అనంత కోటిరాజు ముందు వరసలో ఉంటారని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి రాజువేగేశ్నఫౌండేషన్ కార్యక్రమాలకు మ్యాచింగ్ గ్రాంట్ తీసుకురావడం ద్వారా

- తరువాయి 2లో..

### ముస్లింల పట్ల

## జగన్ ద్వంద వైఖరి

- మంత్రి డా.నిమ్మల రామానాయుడు ధ్వజం



**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** ముస్లింల పట్ల జగన్ ద్వంద వైఖరి ఆంధ్రప్రదేశ్లోనే కాదు యావత్తు దేశానికి తెలిసిందని, ఆయన తీరుకు ముస్లిం వర్గాలు మండిపడుతున్నారని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం పూలపల్లిలో కోటి ఆరు లక్షలతో జిన్నూరు ఛానల్ పంట కాలువ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ మరోసారి జగన్ డబుల్ స్టాండర్డ్ రాజకీయం బయటపడిందన్నారు.వక్ఫ్ బిల్లు విషయం లో ఎన్డీఏకు బలం ఉన్న లోక్ సభలో వ్యతిరేకించి, కేంద్రానికి కీలకమైన రాజ్యసభలో అనుకూలంగా వైసిపి ఓటు వేసింది అన్నారు. జగన్ సూచనలతోనే రాజ్యసభలో బిల్లుకు మద్దతుగా వైసీపీ ఎంపీలు ఓటు

- తరువాయి 2లో..

### కొణికిలో విద్యుత్ ఉప కేంద్రానికి

## ఎమ్మెల్యే చింతమనేని శంకుస్థాపన



**పెదపాడు,మేజర్‌న్యూస్ :** పెదపాడు మండలం కొణికి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. జిల్లా విద్యుత్‌శాఖ సూపర్ ఇంటెండింగ్ ఇంజనీర్ సాల్మన్ రాజు, డి.ఈ కె.ఎం.అంబేద్కర్, పలువురు కూటమి నాయకులు అధికారులతో కలిసి నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఎమ్మెల్యే చింతమనేని భూమి పూజ నిర్వహించారు.

## ఉండి, పాలకొల్లుకు ఏఎంసీ చైర్మన్‌ల నియామకం





**ఉండి /పాలకొల్లు, మేజర్‌న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి, పాలకొల్లుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఉండికి జనసేన నేత జుత్తుగ నాగరాజు, పాలకొల్లుకు టిడిపి నేత కోడి విజయభాస్కర్‌ను నియమించారు. శుక్రవారం రాష్ట్రంలోని 38 ఏఎంసీలను ప్రభుత్వం ప్రకటించింది. రెండు స్థానాల్లో నియమించింది. ఒకటి టిడిపి ఒకటి జనసేనకు పదవులు లభించాయి.

## నరసాపురాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

- అధికారులు,ప్రజాప్రతినిధులు చెత్త నిర్మూలనకు కృషి చేయాలి





**నరసాపురం,మేజర్‌న్యూస్:** నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన శుక్రవారం 'పరిశుభ్ర నరసాపురం'కు తీసుకోవాల్సిన చర్యలపైఅధికారులు,ప్రజా ప్రతినిధు లు, శానిటరీ వర్కర్స్‌తో సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ నరసాపురం డంపింగ్ పెద్ద సమస్యగా మారిందని,గోదావరినదిఒడ్డున డంపింగ్ చేయడంతో భూమి, వాయు, నీరుకాలుష్యం అవుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పరిశీలించి అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ చర్యలకు పూనుకున్న సందర్భంలో, కొంత సమయాన్ని అడిగి తాత్కాలికంగా చర్యలను నిలుపుదలచేసుకోవడంజరిగిందన్నారు. నరసాపురం ప్రజలు చైతన్యవంతులు కావాలని, నరసాపురానికి కొన్ని వందల సంవత్సరాలచరిత్ర ఉందని,దీనిని చేజేతులా నాశనం చేసుకోరాదని హితవు పలికారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు అందరు సహాయ సహకారాలతో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ వహించిచెత్తరహిత నరసా పురంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త

- తరువాయి 2లో..

# రాపిడ్ ,ఉబర్ ,ఓలా సంస్థల అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలి

**– ఏపీ ఆటో ,ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర నేత అహ్మద్**




**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాపిడో ఉబర్ ఓలా సంస్థల అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు నగరంలోని ఆటో డ్రైవర్లు శుక్రవారం ఉదయం పాత బస్టాండ్ సెంటర్ నుండి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం జరిగిన కలెక్టరేట్ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ విదేశీ కంపెనీలైన రాపిడో ఉబర్ ఓలా సంస్థల అనుమతులను భేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకొని కోట్లాది రూపాయలు ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని అన్నారు. కేరళలోని రాష్ట్ర ప్రభుత్వం సవారి యాప్ ద్వారా ఆ రాష్ట్రంలోని ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఆరు శాతం కమిషన్ కి సేవలను అందిస్తోంది అని తెలిపారు. మన రాష్ట్రంలో రాపిడో వంటి సంస్థలు 25 నుండి 30శాతం కమిషన్లను గుంజుతున్నాయని విమర్శించారు. రాపిడో ఉబర్ ఓలా సంస్థలను నిషేధించకపోతే రానున్న కాలంలో ఆటో, టాక్సీ డ్రైవర్లందరిని సమీకరించి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని దానికి ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉంటుందని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి సోమయ్య జెండా ఊపి ఆటో ర్యాలీని ప్రారంభించగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డిఎన్విడి ప్రసాద్, ఆర్ లింగరాజు ఆటో డ్రైవర్లకు మద్దతును తెలియజేశారు. ఈ ర్యాలీ ధర్నా కార్యక్రమాలకు ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ అమర్ కుమార్, జె గోపి నగర అధ్యక్ష కార్యదర్శులు అడ్డాల రాజు, బి చంద్రశేఖర్ నాయకత్వం వహించగా పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు తమ ఆటోలతో ర్యాలీలో పాల్గొన్నారు.

# రీసర్వే కి రైతులు సహకరించాలి : తాసిల్దార్ బి సుమతి






**దెందులూరు,మేజర్ న్యూస్ :** భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తాసిల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం ముప్పవరం గ్రామ సచివాలయంలో రీ సర్వే పై గ్రామసభ జరిగింది. గ్రామ సభలో తాసిల్దార్ మాట్లాడుతఏవిధంగా రీ సర్వే చేస్తున్నాము రైతులందరూ గమనించాలన్నారు రీ సర్వే చేసేటప్పుడు ముందుగానే రైతులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇచ్చిన సమాచారానికి అనుగుణంగా రైతులు డాక్యుమెంట్లు తీసుకువచ్చిసర్వేకు వచ్చి భూములు హద్దులు తెలియ చేయాలన్నారు. వచ్చేటప్పుడు ఆధార్ బ్యాంకు బుక్ ఫోన్ నెంబర్ పాసుబుక్ రెండు ఫోటోలు రైతులు తీసుకురావాలన్నారు. గ్రామసభలో మండల రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ రవిచంద్ర మండల సర్వేయర్ రమణారావు గ్రామ నాయకులు రైతులు గ్రామస్తులు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# వీర పేరంటాలమ్మ అందరిని చల్లగా చూడాలి

**మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు**



**ఉండి,మేజర్ న్యూస్:**వెలువర్రు వీర పేరంటాలమ్మ అందర్నీ చల్లగా చూసి, అందరికీ శుభాలు కలగజేయాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఉండి మండలం వెలువర్రు గ్రామంలో కొలువై ఉన్న గ్రామ దేవత వీర పేరంటాలమ్మ అమ్మవారి 72వ జాతర మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ దేవాలయం ప్రాంగణం అభివృద్ధి చెంది భక్తులకు సౌకర్యవంతంగా ఉందన్నారు ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను, ఆలయ కమిటీని అభినందించారు. అమ్మవారి ప్రతిష్ట మహోత్సవంలో నేను పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విశ్వవాసు నామ సంవత్సర ఉగాది అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండి శు భాలు కలగజేయాలని, అందరికీ ఉగాది శు భాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు ఆలయ చైర్మన్ గాదిరాజు వెంకటరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ సర్పంచ్ పొత్తూరి వెంకటేశ్వరరాజు, కుడిపూడి నాగరాజు ఉన్నారు.

# మే 4న నిర్వహించే నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



**భీమవరం,మేజర్ న్యూస్ :**జిల్లాలో మే 4న నిర్వహించే నీట్ ఎగ్జామ్స్ సంబంధించిన ఏర్పాట్లను అత్యంత పగడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు కలెక్టర్ చదలవాడ నాగరాణి నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, పరీక్షలు నిర్వహణ డిస్టిక్ నోడల్ అధికారి, ఎన్ఐటి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో 2,100 మంది అభ్యర్థులు నీట్ పరీక్షలు రాయుటకు తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటి, శశి కాలేజీ లలో రెండు సెంటర్లను కేటాయించడం జరిగిందని మే 4వ తేదీన పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్ష ఆఫ్ లైన్ లో జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లకు ఇప్పటినుండే సంబంధిత సెంటర్లను పూర్తిస్థాయిలో పరీక్షించి అన్ని ఏర్పాట్లను పగటిబందీగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డిఇఓ ఇ.నారాయణ, పరీక్షలు నిర్వహణ డిస్టిక్‌నోడల్ అధికారిఎన్.జయరాం,ఎన్ఐటి.సూపరిం టెండెంట్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ ఎన్.సునీల్ కుమార్, తాడేపల్లిగూడెం డిఎస్పి డి.విశ్వనాథ్, పాల్గొన్నారు.

# ఆయన సేవలు 'అనంతం'

**మొదటిపేజి తరువాయి**

మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు కషిచేస్తానని తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ సమాజానికి కావాల్సిన ఆరోగ్యం, విద్య విషయాల్లో వేగేశ్న ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. నూటికి 70 శాతం మంది సురక్షిత నీరు అందక ఆసుపత్రుల పాలవుతున్నారని తెలిపారు. దీనిని గుర్తించి ప్రజలకు ఉపయోగపడేలా సేవలు చేస్తున్న దాత కోటిరాజుకు కోటి వందనాలు తెలియచేశారు.ఎమ్మెల్యే ధర్మరాజుమాట్లాడుతూ గణపవరం,ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి అనంత కోటిరాజు తమ ఫౌండేషన్ ద్వారా ఎనలేనిసహకారం అందిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగానూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అటువంటి గొప్ప వ్యక్తి అయిన అనంతకోటిరాజు తన నియోజకవర్గానికి చెందిన వారు కావడం తమకు గర్వకారణమన్నారు.ఫౌండేషన్ చైర్మన్ అనంతకోటిరాజు మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఉన్నంతలో ఇతరులకు సాయపడాలన్నారు. తన మాతృభూమికి సేవచేసుకునే గొప్ప అవకాశం కలగడం తనఅదృష్టమని, సమిష్టికృషితో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నా మన్నారు. గణపవరం గ్రామాభివృద్ధికి ఎనలేని సహకారం అందిస్తున్న అనంతకోటి రాజు, బాల సరస్వతి దంపతులు,వారి కుమార్తె శ్రీవాణిలను గజమాలలతో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు,ఎంపీపీ అర్ధవరం రాము,జెడ్పీటీసీ సభ్యురాలు దేవరపు సోమలక్ష్మి, సర్పంచ్ మూర అలంకారం, ప్రముఖులు కాకర్ల శ్రీను, నడింపల్లి సోమరాజు, జగపతిరాజు, దండు రాము, ఇందుకూరి రామకష్ణంరాజు, సురేంద్ర కుమార్,ఇందుకూరి అశోక్, తోట శ్రీను, వేగేశ్న సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల పట్ల జగన్ ద్వంద వైఖరి

**మొదటిపేజి తరువాయి**

వేశారన్నారు. ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు ఓటింగ్ తర్వాత విప్ జారీ తో వైసిపి డ్రామా ఆడిందన్నారు. ఓటింగ్ తరువాత విప్ జారీ చేయడం లోక్ సభ చరిత్రలోనే లేదన్నారు. రాజ్యసభలో మద్దతుపై జగన్ నిజ స్వరూపం మైనార్టీ వర్గానికి అర్థమయింధని తెలిపారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు, నిన్నటి వరకు వైసిపి కబుర్లు. నేడు రాజ్యసభలో సైలెంట్ గా మద్దతు ఇచ్చిందంటే ద్వంద వైఖరి తెలిసిందన్నారు.జగన్ తీరుతో షాక్ తిన్న ముస్లిం వర్గాలు, వైసిపి వెన్నుపోటు రాజకీయాలపై ముస్లింల మండిపడుతున్నారనీ చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పినా జగన్ తీరులో మార్పు లేదని ఇప్పటికైనా ఓపెన్‌గా మాట్లాడటం నేర్చుకోవాలని మంత్రి రామానాయుడు హితవు పలికారు.

# నరసాపురాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

**మొదటిపేజి తరువాయి**

వారి ఇంటిలోనే వేరు చేసే ఇచ్చేలా ప్రోత్సహించాలన్నారు. డంపింగ్ యార్డ్‌కు అవసరమైన స్థల సేకరణలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలను అందించాలన్నారు.ప్రజా ప్రతినిధులుగా పరిశుభ్ర నరసాపురంగా రూపుదిద్దుచేందుకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామనిఈ సందర్భంగా తెలిపారు.జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చెత్త రహిత నరసాపురంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలను ముందుస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ మూడో శనివారం "ఈ వేస్ట్" థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఎలక్ట్రానిక్ వస్తువులను చెత్తలో కల్పరాదని, ప్రత్యేకంగా సేకరించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు.ఈ సమావేశంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య,మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ , వైస్ చైర్ పర్సన్ కామన నాగిణి, కార్పొరేటర్లు బొమ్మిడి సూర్యకుమారి, తోట అరుణ, కోప్పాడ కృష్ణవేణి, ఎస్.మీరమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సెక్రటరీలు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ నగర్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

**ఏలూరు, మేజర్ న్యూస్ :** ఏలూరు రూరల్ పరిధిలోని శ్రీరామ నగర్ కు చెందిన ఏనుగ శివరామకృష్ణ అనే వ్యక్తి (46) అనుమానాస్పద స్థితిలో మృతి మృతి చెందాడు. మూడు రోజుల తర్వాత గుర్తించారు. పోలీసులు విచారణ ప్రారంభించారు. పూర్తి వివరాలు ఇంకా అందవలసి ఉంది.

# ప్రభుత్వ కాలనీలో ముంపు అరికట్టడంలో అధికారులు విఫలం

**– సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్**



**పాలకోడేరు,మేజర్ న్యూస్:** ఆక్వా చెరువుల వ్యర్థాలతో నిండిపోయిన దుస్థితిపై మోగల్లు ప్రభుత్వ కాలనీలో పరిశీలించిన సిపిఎం జిల్లా నేతలు.నా పరిధి కాదు ఎంపిడిఓ కి ఫోన్ చెయ్యండి అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పిన ఎమ్మార్వో ఆక్వా వ్యర్థాలు వలన జ్వరాలు, వాంతులు వంటి అనారోగ్యాలతో పిల్లలు.మోగల్లు ప్రభుత్వ కాలనీ తరచూ ముంపుకు గురవుతున్నా వాటిని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి. గోపాలన్ విమర్శించారు. శుక్రవారం మోగల్లు గ్రామంలో ప్రభుత్వ కాలనీని సీపీఎం బృందం పరిశీలించింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి. గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ గ్రామంలో 750 స్థలాలు ఇచ్చారని తెలిపారు. మోగల్లు గ్రామంతో పాటుగా గరగపర్రు, గొల్లల కోడేరు, శృంగ వృక్షం, పాలకోడేరు గ్రామాలు నుంచి కూడా ప్రజలకు స్థలాలు ఇచ్చారని తెలిపారు. ఎవరి స్వగ్రామంలోనే వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరితే ఇవ్వము అని అధికారులు చెప్పడంతో గత్యంతరం లేక గ్రామానికి దూరమైనా ఇక్కడ స్థలాలు తీసుకొని ఇల్లు నిర్మించుకుంటున్నారని తెలిపారు. ఆక్వా చెరువుల్లో ఉన్న నీటిని బయటికి తోడేయడంతో వరి చేలతో పాటు ఈ కాలనీ కూడా తీవ్రంగా ముంపుకు గురవుతుందన్నారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో ఎన్ని సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా కనీస స్పందన లేదన్నారు. ఈ విషయమై ఎమ్మార్వో తో మాట్లాడితే నా పరిధి కాదు ఎంపీడీవోతో మాట్లాడుకోండి అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పడం సరికాదు అన్నారు. ముంపు గురించి తెలిసిన కలెక్టర్ వెంటనే ఎమ్మార్వోకి ఆదేశాలు జారీ చేసిన వాటిని పక్కన పెట్టడం అన్యాయం అన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే ఎమ్మార్వో కు ఆదేశాలు జారీ చేసినా ఏమీ పట్టనట్లు ఉన్నారని మండిపడ్డారు. తక్షణం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గోపాలన్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కే క్రాంతి బాబు, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, గ్రామ కార్యదర్శి పాల వెంకటస్వామి, నాయకులు వీరవల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల బాబురావు, కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

# హరిత విప్లవ పితామహుడు బాబు జగ్జీవన్ రామ్



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె అజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యాభ్యాసం ద్వారా అత్యున్నత స్థానానికి చేరుకోవడం ద్వారా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు.అనంతరం పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు టి వెంకట దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రిగా హరిత విప్లవానికి నాంది పలుకుతూ భారతదేశం ఆహార గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించడానికి దోహదపడ్డారన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు డాక్టర్ ఎం రాంబాబు,వి వెంకట్రావు,ఎస్ పరమేశ,డాక్టర్ ఎం విజయ కుమార్,డాక్టర్ పిఆర్ కావ్య శ్రీ ,ఎస్ సుస్యలత,డి సుజాత తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళల ఉత్పత్తులు పరిశీలించిన పిఓ నాయక్



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** డ్వాక్రా మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను మార్కెట్లో విక్రయించి ఆర్థికంగా ఎదగాలని ఐటిడిఏ పిఓ శ్రీరాముల నాయక్ సూచించారు. శుక్రవారం కామయ్యపాలెంలోని అరణ్య వన్ దన్ వికాస కేంద్రంలోను, జిల్లెళ్ళ గూడెం గ్రామంలో అంబేద్కర్ వన్ దన్ వికాస్ కేంద్రంలో ప్రాసెసింగ్ చేస్తున్న చింతపండు, కారం ఉత్పత్తులను ఐటీడీఏ పీవో శ్రీరాముల నాయక్ డ్వామా ఏపిడి రాజబాబు ఏపిఎం ఝాన్సీతో కలిసి పరిశీలించారు. డ్వాక్రా మహిళలు చేస్తున్న ఉత్పత్తులను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ పలు సూచనలు సలహాలుచేశారు.మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరకు విక్రయించి ఆర్థికంగా లబ్ధి చేకూరేలా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ అరుణ, సిబ్బంది డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# కోకో గింజలు కొనుగోలు,ధర సమస్యలపై పోరాడతాం

**– ఈనెల 7 వరకు మంత్రి ఆదేశాల మేరకు ఎదురుచూస్తాం**




**ఏలూరు,మేజర్ న్యూస్:** కోకో గింజలు కొనుగోలు, ధర సమస్యలపై కోకో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ,ఉద్యాన శాఖా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఈనెల 7 వరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం కోసం, న్యాయం కోసం ఎదురు చూస్తామని లేనిపక్షంలో కోకో రైతుల పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల రాష్ట్ర నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. గత నెల రోజులుగా కోకో రైతులు ఆందోళన చేసిన ఫలితంగా కోకో రైతు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపడం హర్షనీయమన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో జరిగిన జాయింట్ సమావేశంలో కంపెనీల ప్రతినిధులు అబద్దాలు వల్లించడం దుర్మార్గమన్నారు. మంత్రి ఆదేశాల మేరకు ఈనెల 7 వరకు కోకో గింజలు కొనుగోలు, ధర సమస్యలపై సానుకూల నిర్ణయం కోసం ఎదురు చూస్తామని చెప్పారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, గుది బండి వీరారెడ్డి, రాష్ట్ర కోశాధికారి జాస్తి కాశీ బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు, టి.లోకేష్,కూసం రామిరెడ్డి, రవి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప.గో.జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గం

**– నియామక పత్రాలను అందజేసిన జిల్లా అధ్యక్షులు హరి కుమార్ రాజు**



**భీమవరం,మేజర్ న్యూస్:** పశ్చిమగోదావరి జిల్లా కొత్త జిల్లా కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. శుక్రవారం భీమవరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ప్రకటించిన సభ్యులకు జిల్లా డిసిసి ప్రెసిడెంట్ హరికుమార్ రాజు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హరికుమార్ రాజు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి బూత్ లెవెల్ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుం టామని, పార్టీ బలోపేతం కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎప్పుడైనా ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.కొత్తగా నియమితులైన వారిలో జిల్లా వైస్ ప్రెసిడెంట్లుగా అర్దంకి దొరబాబు, ఎడ్ల శివాజీ, గాదిరెడ్డి వనమయ్య, పోలమెర్ల వెంకటేశ్వరరావు ఉన్నారు.జిల్లా జనరల్ సెక్రటరీలుగా పుచ్చకాయల రత్నరాజు, సనకు ప్రసాద్, ధర్మేంద్ర, కృష్ణ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించగా, మేడపాటి సాగర్, కొర్ర శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మరో 15 మందిని జిల్లా జాయింట్ సెక్రటరీలుగా నియమించినట్లు హరికుమార్ రాజు తెలిపారు. ఈ నూతన నియామకాలతో కాంగ్రెస్ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తుందని, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపడమే లక్ష్యమని నేతలు పేర్కొన్నారు.

## ట్రైనీ డాక్టర్ అంజలి కుటుంబాన్ని ఆదుకుంటాం : బొరగం

**– ఎంపీటీసీ నాలి శ్రీనివాస్‌కు పరామర్శ**




**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** మండలంలోని పి.అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీనివాస్ వదిన హార్ట్ ఎటాక్‌తో మరణించడంతో ఆ కుటుంబాన్ని శుక్రవారం ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పరామర్శించారు. అలాగే మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి కృష్ణ,శివాజీ,ఎంపీటీసీ ఉదయ్ కుమార్, పేరు పోయిన దాము, తోట బాలు, ఆంజనేయులు, కిరణ్ టిడిపి నాయకులు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ట్రైనీ డాక్టర్ నల్లపు అంజలి మృతి బాధాకరమని ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అంజలి చికిత్స పొందుతూ మరణించిందని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అన్నివేళలా అండగా ఉంటామని ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

## వృద్ధాశ్రమానికి విద్యార్థుల వితరణ



**పాలకోడేరు,మేజర్‌న్యూస్:** భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పెన్నాడ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మహదేవపట్నంలోని సన్ రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి ఒకరోజు అయ్యే ఖర్చును ఈసీఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులు తమ సహచర విద్యార్థి కే లోహిత్ సాయి మణికంఠ జ్ఞాపకార్థం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పర్తి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్న వయసు నుండి సేవాగుణం కలిగి ఉండాలని అన్నారు.ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏబిఎస్ఆర్ మనోహర్,అకడమిక్ డీన్ డాక్టర్ కురెళ్ళ భాస్కర రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రం





**– ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

**పెదవేగి,మేజర్ న్యూస్:** పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో రబి సీజన్లో ఏలూరు జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాల రైతుల సంక్షేమానికి అండగా ఉంటుందని,రబీ సీజన్లో ఏలూరు జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంఎంతో గర్వకారణమని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో రైతులు పండించే ధాన్యానికి కనీస గిట్టుబాటు ధర లేక ఆర్బికేల ద్వారా సేకరించిన ధాన్యానికి తిరిగి రైతులకు ఎప్పుడు డబ్బులు పడతాయో తెలియక రైతులు ఆందోళన చెందే వారిని అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు హబీబ్ భాషా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే రైతులకు గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రూ. 864 కోట్ల రూపాయల చెల్లింపులో కీలక కీలక పాత్ర ఎమ్మెల్యే చింతమనేని పోషించారని తెలిపారు. తాను ఏలూరు జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులుగా వచ్చినప్పుడు రైతులకు ధాన్యం బకాయిలు ఎంత ఉంది అని ఎమ్మెల్యే ప్రశ్నించగా తాను జిల్లా నివేదిక చెప్పబోయానని, అయితే కేవలం జిల్లా మాత్రమే కాదని,అసలు రాష్ట్రంలో ఎంతమంది రైతులు ఈ విధంగా బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నారంటూ ఆ గణాంకాలు నివేదికలు అడిగి తెలుసుకున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 864 కోట్ల రూపాయలు రైతులకు బకాయిలు ఉన్నాయని తెలుపగా వెంటనే ఆయనతోపాటు తనను కారులో తీసుకొనివెళ్లి అప్పటి వెళ్లి పౌర సరఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండ్యన్‌తో ఈ విషయంపై చర్చించారని, అదేవిధంగా రైతులకు బకాయిలు సత్వరమే విడుదల కావాలనే లక్ష్యంతో మంత్రి అయిన నాదెండ్ల మనోహర్‌తో కూడా ఈ అంశం పై మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చేయడంలో చింతమనేని ఎంతో కృషి చేశారని ఉపసంచాలకులు హబీబ్ భాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండల పార్టీ అధ్యక్షులు బొప్పన సుధా, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, కమ్మ శివరామ కృష్ణ,వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు వై సుబ్బారావు, మండల రెవెన్యూ అధికారి భ్రమరాంబ, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సహా పలువురు కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు..

# ఫార్మసిస్టు అంజలి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



**– దోషినికఠినంగా శిక్షించాలి: సిపిఎం డిమాండ్**

**ఏలూరు,మేజర్ న్యూస్:** రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న నల్లపు అంజలి ఆత్మహత్య చేసుకుని చనిపోయిన సంఘటనపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి స్పందించారు. అంజలి మృతిపై పోలీస్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని,మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నల్లపు అంజలి జిలిగిమిల్లి మండలం రౌతు గూడెం గ్రామానికి చెందిన నల్లపు దుర్గారావు కుమార్తెని ఆయన తెలిపారు. అంజలి రాజమండ్రిలోని కొలినేని ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ గా పని చేస్తుందని అన్నారు. ఆస్పత్రిలో ఉన్న డాక్టర్ ఒకరు ప్రేమ పేరుతో మోసం చేయడంతో మనస్థాపానికి గురై తను చనిపోయినట్లుగా ఆస్పత్రిలో తనతో పాటు పనిచేస్తున్న వారి దగ్గర నుంచి సమాచారం అందుతుందని అన్నారు. ఈ మృతిపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి, మృతికి గల కారణాలను వెలికి తీయాలని, అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ముస్లింల ఆస్తులు కాజేసే కుట్ర - సిపిఎం



**నరసాపురం,మేజర్‌న్యూస్ :**మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ సవరణను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని పంజా సెంటర్,చేపల మసీదు వద్ద మైనార్టీ ముస్లింలతో కలసి నిరసన చేపట్టారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా మతాల మధ్య చిచ్చుపెట్టే వక్ఫ్ చట్ట సవరణను ప్రజలంతా ఖండించండి లౌకిక విలువలను హరించే వక్ఫ్ సవరణను వ్యతిరేకించండి లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడండి బిజెపి మతోన్మాద విధానాన్ని వ్యతిరేకించండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దరాజు పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తుందన్నారు, లవ్ జిహాద్,ఘరవాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం వంటి చర్యలకు హిందుత్వ శక్తులు పాల్పడుతు, మరొకపక్క వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింల ధార్మిక, సామాజిక, సంస్కృతిక, సంస్థలపై దాడి తలపెట్టిందని విమర్శించారు,

ఈ చట్టం ముస్లింలు ఆస్తులను కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులను అభివృద్ధికి కాదని అన్నారు ,ఈ దుర్మార్గమైన సవరణలను చేస్తూ ముస్లిం ప్రజల ఆస్తులపై యుద్ధాన్ని ప్రకటిస్తుందని దీనిని లౌక్య పార్టీలుగా చెప్పుకునే టిడిపి జనసేన పార్టీలు తో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కై బలపరచటం లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమని గుర్తు చేశారు , ఒక్కసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులు శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులుగా ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకంగా ఈ చట్టం ,చేయబడిందని అన్నారు. భారత రాజ్యాంగంలోని 25 ,29, 30 తదితర నిబంధనలకు వ్యతిరేకంగా ఈ చట్టం చేయబడిందని మసీదులు దర్గాలు స్మశానాలు ఇప్పుడు మరింత ప్రమాదంలో పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టపడతాయని , ఇతర మతాలవారు వక్ఫ్ బోర్డులో సభ్యుల్లో చేర్చి వాటిని వివాదాస్పదం చేసి భారత ప్రజలను మతపరంగా విభజించే కుట్రలో భాగంగా బిజెపి మతోన్మాద విధానాలు ముందుకు తీసుకొస్తుందని ఇది దేశానికి చాలా ప్రమాదకరమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పొగాకు పూర్ణ, పొగాకు నారాయణరావు, నోములకొండ, ఎండి అజిజ్, ఎండి షానవాజ్ ఖాన్ ,ఎస్.కె అహ్మద్ షా ,ఎస్ కె మహమ్మద్ షరీఫ్, ఎండి ఖఖ మోహిద్, ఎండి ఫిరోజ్ ఖాన్ ,నూర్ మహమ్మద్ మోహిద్దిన్, ఎండి అబ్దుల్ రషీ ,ఎస్ కే అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల మాక్ డ్రిల్





**వేలేరుపాడు,మేజర్ న్యూస్:** విపత్తు సమయంలో స్పందనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, శుక్రవారం చిగురుమామిడి గ్రామంలో ఏపీ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించారు.ఈ మాక్ డ్రిల్‌లో రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య, పంచాయతీ రాజ్, విద్యుత్ ,జిల్లా పోలీస్ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో ఈ వినూత్న కార్యక్రమంను నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌లో విపత్తులు సంభవించిన సమయంలో ప్రజలు ఎలా స్పందించాలి, సంబంధిత శాఖలు ఏవిధంగా సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలి అనే విషయాలపై ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. భూకంపం, అగ్నిప్రమాదం, వరదలు వంటి విపత్తులను దృష్టిలో పెట్టుకొని శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థులకు విపత్తులపై అవగాహన పెరిగినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచేందుకు ఇది గొప్ప అవకాశం కావడంతో,అన్ని శాఖలు సజావుగా కలిసి పనిచేసాయి. గ్రామస్థుల సహకారంతో మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో రక్షణ పరిజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈకార్యక్రమంలో ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది,కుక్కునూరు ఇన్స్పెక్టర్ ఎం.రమేష్ బాబు,వేలూరుపాడు ఎస్సై,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో వృద్ధుడి మృతి





**టీ.నర్సాపురం,మేజర్ న్యూస్:** మండలం జగ్గవరం గ్రామానికి చెందిన కొక్కుల సోమేశ్వరరావు వయసు (60) అనే వ్యక్తి గత కొంతకాలం నుండి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఆసుపత్రికి బయలుదేరి మార్గ మధ్యంలో గుండేపోటుతో మధ్యలోనే మారణించాడు. తన భార్యను వెంటబెట్టుకొని జగ్గవరం నుండి ఏలూరు డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ ఏపీ 16 జెడ్ 0031 బస్సులో హాస్పటల్‌కి బయలుదేరారు మార్గమధ్యంలో రాజు పోతేపల్లి సెంటర్ వద్దకు వచ్చిన తర్వాత ఒక్కసారిగా గుండెపోటు రావడంతో బస్సులో అక్కడికక్కడే మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## పంచర్ పడి ఆటో బోల్తా : 10మంది కూలీలకు గాయాలు





చింతలపూడి,మేజర్ న్యూస్: సరిహద్దు రాష్ట్రమైన తెలంగాణలోని దిద్దుపూడి గ్రామానికి చెందిన కూలీలు చింతలపూడి మండలం వెలగలపల్లిలో మొక్కజొన్న ఫ్యాక్టరీలో రాత్రివేళ పనికి వెళ్లి ట్రక్ ఆటోలో తిరిగి వస్తుండగా ఆటో పంచర్ కావడంతో శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఆంథోనీ నగర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడటంతో 10మంది మహిళా కూలీలకి గాయాలయ్యాయి. శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఆదేశాల మేరకు వెంటనే ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు అప్రమత్తమై వైద్యం అందించారు. కనపర్తి లక్ష్మి అనే మహిళకు మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. మిగతా క్షతగాత్రులంతా క్షేమంగానే వున్నారని హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

# పీఎం లంక అభివృద్ధికి కేంద్ర ఆర్థిక మంత్రి అన్ని విధాల చర్యలు





**– పిల్లలను పాఠశాలకు విధిగా పంపాలని జిల్లా కలెక్టర్ హితవు**

**మొగల్తూరు,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పెదమైనవానిలంక డిజిటల్ భవనాన్ని, పీఎం లంక సముద్రపు కోతకు గురయ్యే ప్రాంతంలో డెలాయిట్ కంపెనీ చేపట్టనున్న ప్రాజెక్ట్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్‌చదలవాడ నాగరాణి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా నరసాపురం శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,ఆర్డిఓ దాసిరాజు తదితరులు ఉన్నారు. తొలుత డిజిటల్ భవన్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్ సహకారంతో పీఎం లంకను అన్ని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని, పిల్లలు మాత్రం 6,7,8 తరగతులలో డ్రాప్స్ అవ్వకూడదని, ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పిల్లలను మాత్రం చదివించాలని చాలా అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పీఎం లంక నందు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పర్యవేక్షణలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై స్థానిక ప్రజలకు వివరించారు. పీఎం లంక ప్రాంతం సముద్రపు కోతకు గురి కావడం, దీనిని నిరోధించడానికి డెలాయిట్ కంపెనీ ఒక కిలోమీటర్ పరిధిలో సి.ఎస్.ఆర్ ఫండ్స్.తో స్ట్రక్చర్ నిర్మించే పనులను రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టడం జరుగుతుందన్నారు.ఇది మీ అందరి కోసం చేపట్టే గొప్ప ప్రాజెక్టుఅని, రెండున్నర కిలోమీటర్లు అడ్డుగోడ నిర్మాణం చేపట్టాలనేది ప్రతిపాదించగా, తొలుత ఒక కిలోమీటర్ పరిధిలో చేపట్టడం జరుగుతుందని,తర్వాత ఒకటిన్నర కిలోమీటర్లు పరిధిలో కూడా విస్తరించడం జరుగుతుందని తెలిపారు. నరసాపురం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడ నాయకర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన పీఎం లంక అభివృద్ధికి కేంద్రమంత్రి సీతారామన్ దత్తత తీసుకొని వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం ఇక్కడ ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు. సోలార్ ప్యానల్స్ కూడా అమర్చడంతో నిరంతర విద్యుత్ ఎటువంటి ఖర్చు లేకుండా మీకు సమకూరుతుందన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ భవన్ ద్వారా నైపుణ్యాలను పెంచుకొని ప్రయోజకులు కావాలని కోరారు. అభివృద్ధికి సహకరిస్తే మీ ప్రాంతానికి మంచి ప్రాజెక్టులు వస్తాయని తెలిపారు.అనంతరం పీఎం లంక సముద్రపు కోతకు గురయ్యే ప్రాంతంలో డెలాయిట్ కంపెనీ చేపట్టనున్న ప్రాజెక్ట్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్థానిక శాసనసభ్యులు,జిల్లా జాయింట్ కలెక్టర్ తో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంలో రైతులతో మాట్లాడీ సముద్రపు కోత నిరోధక కట్ట ప్రయోజనాలను వివరించి ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో దాసిరాజు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎ.రఘునాధబాబు, డ్వామా పిడి డా.కె.సిహెచ్ అప్పారావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ కె.శ్రీనివాస్, జిల్లా టూరిజం శాఖ అధికారి అప్పారావు, సర్పంచ్ ఎం.శివకుమార్,ఇన్చార్జితహసిల్దార్ఐవివి సత్య నారాయణ, ఎంపీడీవో జీవీఎస్ కృష్ణంరాజు,పిఆర్ఈఈ కె.శ్రీనివాసరావు, ఏఈ డి.నాగేశ్వరరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కడుపు నొప్పి భరించలేక యువతి ఆత్మహత్య



టి.నర్సాపురం,మేజర్‌న్యూస్: ఉప్పలపాడు గ్రామానికి చెందిన కాళ్ళీడి ధన లక్ష్మీనారాయణ భార్య గంగ భవాని (35)అనే యువతి తీవ్రమైన కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది.సుమారు 15 సంవత్సరాల క్రితం టి.నర్సాపురం మండలం,తిరుమల దేవి పేట గ్రామానికి చెందిన ఆమె మేనమామ కాళ్ళీడి ధన లక్ష్మీనారాయణకు ఇచ్చి వివాహం చేయగా, వారికి ఒక బాబు,ఒక పాప సంతానం కలరు.

గంగాభవాని గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నది. ఆమె తన అన్నయ్యను చూడడానికి తన పిల్లలతో కలిసి 2వ తేదీ సాయంత్రం తన పుట్టింటికి కామవరపుకోట మండలం ఉప్పలపాడు గ్రామం వచ్చినట్లు,అదే రోజు రాత్రి కూడా ఆమెకు కడుపునొప్పి వచ్చినట్లు 3వ తేదీన ఉదయం ఆమె తండ్రి పొలం,తల్లి వేరే ఊరు వెళ్ళగా గంగా భవాని తన పిల్లలతో కలిసి ఇంటి వద్ద ఉన్నది. ఆమెకు మరల తీవ్రమైన కడుపు నొప్పి రావడం వలన, ఆ నొప్పి తట్టుకోలేక మధ్యాహ్నం సుమారు 3.45 గం.ల సమయంలో ఇంట్లో ఉరివేసుకుని చనిపోయినది. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ప్రజలంతా సంతోషంగా జీవించాలన్నదే తన ఆకాంక్ష





**– ఎమ్మెల్యే బడేటి చంటి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** స్వేచ్ఛాయుతమైన స్నేహపూర్వక వాతావరణంలో ప్రజలంతా సంతోషంగా జీవించాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతోంది. దీనిలో భాగంగా శుక్రవారం పలువురు తమ సమస్యలను విన్నవించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే చంటి. వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంతోనే అసలైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందన్నారు.దీన్ని దృష్టిలో ఉంచుకుని నియోజక వర్గంలో స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు.ఈకార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్ధసారధి, నగర పార్టీ అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నాయకులు చల్ల సత్య వరప్రసాద్, చిరంజీవి, గూడవల్లి వాసు, నౌడూరి వాసు, త్రిపర్ణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

– ఎమ్మెల్యే ని కలిసిన పిపి నారాయణ –కాగా ఏలూరు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన న్యాయవాది ఏవి నారాయణ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే బడేటి చంటి,పార్టీ సీనియర్ నాయకులు చల్లా వెంకట సత్య వరప్రసాదరావులను కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం న్యాయవాది నారాయణను ఎమ్మెల్యే బడేటి చంటి ఘనంగా సన్మానించారు.

## చంద్రన్న స్వయం ఉపాధి ఇంటర్వ్యూలు



**నరసాపురం రూరల్,మేజర్‌న్యూస్:** చంద్రన్న స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. 1358 మంది బిసి,ఈ బీసీ, కాపు కులాలకు చెందిన వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగా 558 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొదటిరోజు చిట్టవరం, గొంది, నవరసపురం, లిఖితపూడి, మల్లవరం, కొప్పర్రు, కే బేతపూడి తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఎంపీపీ మైలబత్తుల సోనీ, కార్యాలయ పర్యవేక్షకులు వీరభద్ర రావు, సురేష్, కొప్పర్రు, రాయపేట, ఆంధ్ర బ్యాంక్ మెయిన్, ఎస్బిఐ తదితర బ్యాంకుల మేనేజర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విత్తన శుద్ధి కర్మాగార పనులు అడ్డుకున్న అల్లం చర్ల గ్రామస్తులు



**టి.నర్సాపురం, మేజర్‌న్యూస్ :** టి.నర్సాపురం మండలం అల్లంచర్ల గ్రామంలో సర్వేనెంబర్ 70లో సుమారు 126 ఎకరాల భూమి ఉంది.ఈ సర్వే నెంబర్ లో2006 సంవత్సరంలో విత్తన శుద్ధి కర్మాగారం కొరకు వ్యవసాయ శాఖ వారికి 40 ఎకరాల భూమి ఇచ్చి ఉన్నారని. అదే సమయంలో రైతులకు కూడా కొంత భూమి పట్టాలు ఇచ్చారని తాసిల్దార్ సాయిబాబు తెలిపారు. శుక్రవారం ఆ సర్వే నెంబరు భూమి లో అధికారులు జెసిబితో వర్క్ చేస్తుండగా స్థానికులు కొంతమంది అడ్డుకున్నారు.ముందుగా సర్వేనిర్వహించి మాకు పట్టాలు ఇచ్చిన భూమి మాకు అప్పగించి మిగిలిన మీరు తీసుకోండి అని రైతులు అడ్డుకున్నారు. చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. తాసిల్దార్ సాయి బాబు మాట్లాడుతూ త్వరలో సర్వే నిర్వహించి అటు వ్యవ సాయ శాఖ వారికి ఇవ్వవలసిన 40 ఎకరాలు పట్టాలు ఉన్నవా రికి భూమి కూడా చూపిస్తాం అని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాష, మండల వ్యవసాయ శాఖ అధికారులు తోపాటు స్థానికులు ఉన్నారు.

## ఎర్రకాలువలో పడి మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** ఎర్రకాలువలో పడి మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు. సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. లక్కవరం–నాగులగూడెం గ్రామాల మధ్య కొండ దేవతల ఆలయం పాత ఇసుక ర్యాంపు సమీపంలోని ఎర్రకాలువలో ఓ వృద్ధుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు లక్కవరానికి చెందిన చల్లా బసవయ్య(70) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. గురువారం పశువులను మేపేందుకు బసవయ్య కాలువ సమీపంలోకి వెళ్లారు. అయితే ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా కాలువ వద్ద అతడి చెప్పులు, తువ్వాలు, కర్ర ఉన్నాయి. పశువులు కాలువలోకి వెళ్లడంతో వాటిని తోలేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ బసవయ్య మునిగిపోయి ఉంటారని స్థానికులు భావించారు. సమాచారం అందుకున్న లక్కవరం ఎస్సై శశాంక ఘటనాస్థలికి చేరుకుని వృద్ధుడి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు అయితే అర్ధరాత్రి వరకు గాలించినప్పటికీ బసవయ్య మృతదేహం లభ్యం కాకపోవడంతో మరల ఉదయం వెళ్లి చూడగా బసవయ్య మృద్దేహం నీటిలో తేలుతూ ఉండడంతో గుర్తించి స్థానికుల సహకారంతో బయటికి తీశారు.లక్కవరం పోలీస్ లిస్టులో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించనున్నారు.

# ఎంపీ మహేష్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం



గుండుగొలను వద్ద నిలిచిన వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన ఎన్.హెచ్.ఏ.ఐ, ఐడబ్ల్యూఏఐ అధికారులు



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ శాఖల నడుమ కొరవడిన సమన్వయలోపంతో భీమడోలు మండలం గుండుగొలను వద్ద ఏలూరు కాలువపై అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు కొలిక్కి తీసుకువచ్చే దిశగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టి సారించారు. భీమడోలు మండలం గుండుగొలను వైపు వెళ్లే ప్రజలు వ్యతిరేక దిశలో జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తూ తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గుండుగొలను వద్ద ఏలూరు కాలవపై వంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ అనంతరం నిర్మాణ పనుల బాధ్యతలు స్వీకరించిన గుత్తేదారు వంతెన నిర్మాణం ప్రారంభించారు.

అయితే ఏలూరు కాలవపై అనుమతి తీసుకోకుండా, తమ శాఖ మార్గదర్శకాల మేరకు వంతెన నిర్మాణం చేపట్టనందున తక్షణం పనులు నిలిపివేయాలని ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా స్లాబ్ దశ వరకు చేరిన వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. దీంతో ప్రజలు వ్యతిరేక దిశలోనే జాతీయ రహదారి మీదుగా గుండుగొలను వైపు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. స్థానిక ప్రజలు, నాయకులు సమస్యను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం స్పందించిన ఆయన ఇటీవల ఏలూరు శాంతినగర్ లోని తన కార్యాలయంలో ఎన్.హెచ్.ఏ.ఐ, ఐడబ్ల్యూఏఐ అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడం వల్ల అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఎన్.హెచ్.ఎ.ఐ టెక్నికల్ మేనేజర్ సాల్మన్ అన్సోవి, సైట్ ఇంజనీర్ సాయినాథ్, కన్సల్టెన్సీ మేనేజర్ సోమేష్, ఐడబ్ల్యూఎఐ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ శర్మ, జూనియర్ ఇంజనీర్ ఆర్.లోకేష్, ఎంపీ మహేష్ కుమార్ ఓఎస్డి రాఘవులు, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి గుండుగొలను వెళ్లి ఏలూరు కాలువపై నిలిచిన వంతెన నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. వంతెన అసంపూర్తిగా ఉండటం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను స్థానికులు అధికారులకు వివరించారు. ఎంపీ ఆదేశాలతో ఇక్కడికి వచ్చిన తాము సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు బదులిచ్చారు. పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా ఢిల్లీలో ఉన్న ఎంపీ మహేష్ కుమార్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ ను స్వయంగా కలిసి వంతెన నిర్మాణానికి అనుమతి కోరుతానని ఫోన్లోనే అక్కడ ప్రజలకు ఎంపీ భరోసా ఇచ్చారు. తాము చెప్పిందే తడవుగా సమస్య పరిష్కారానికి తన వంతు అవిశ్రాంత కృషి చేస్తున్న ఎంపీ మహేష్ కుమార్‌కు స్థానిక ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# బాలుర వసతి గ్రహాన్ని సందర్శించిన న్యాయసేవాధికారి





**ఏలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. సునీల్ కుమార్ (ఎఫ్.ఎ.సి) ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నం ప్రసాద్ స్థానిక శనివారపు పేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం జిల్లాలోని వసతి గృహాలను ప్రతినెల తనిఖీ చేయాలని అందులో భాగంగా శుక్రవారం ప్రభుత్వ బాలుర వసతి గ్రహాన్ని సందర్శించి, బాలురకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, వైద్య,విద్యా సదుపాయాల పై వివరాలు తెలుసుకోవడం జరిగిందని, అలాగే బాలురకు కల్పిస్తున్న ఇతర సౌకర్యాల గురించి తెలుసుకోవడం జరిగిందని తెలియజేశారు. అబ్జర్వేషన్ హోమ్‌లో ఉన్న బాలుర కేసులు వివరాలు, వాటి పురోగతి, న్యాయవాదుల పనితీరు మొదలైన విషయాలను తెలుసుకొని, కేసులను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సూపరింటె ఒడెంట్ శ్రీవల్లి, డి.పి.ఓ మోహనరావు న్యాయవాదులు టీ వెంకటేశ్వరరావు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో విశేష సేవలు ..
# నేడు జెబీరా సంస్థల 30వ ఆవిర్భావ దినోత్సవం





**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** విద్యా సంస్థల అనగానే లక్షల్లో పెట్టుబడి పెట్టి తమ పిల్లలను చదివించుకునే పరిస్థితి. ఎల్కేజీ నుండి డిగ్రీ వరకు చదవాలంటే కార్పొరేట్ సంస్థల్లో లక్షల ఖర్చు అవుతుంది. సాధారణ, మధ్యతరగతి కుటుంబాలు అయితే ఈ సంస్థల వైపు కన్నెత్తి చూడలేరు. ఎందుకంటే వాటిల్లో చదవాలంటే లక్షల్లో సంపాదన ఉండాలి. ఎక్కువ ప్రైవేటు విద్యాసంస్థలు ఇలానే కొనసాగుతున్నాయి. ఎల్కేజీకి ఇంత, డిగ్రీకి ఇంత అని ఫీజులు ప్రభుత్వాలు నిర్ధారించకపోవడం ఈ సంస్థల అధిక దోపిడీకి అవకాశం కలుగుతుంది. విద్యా సంస్థలు ఇలా ఉన్నా పరిస్థితుల్లో పేదల అభ్యున్నతి కోసం , అందరూ చదువుకోవాలని, పేదలకు విద్య దూరం కాకూడదనే సంకల్పంతో 30 ఏళ్ల క్రితం జేబీరా విద్యాసంస్థలను స్థాపించారు. మండలంలోని సీతారాంపురం, రంపచోడవరం, విశాఖపట్నం తదితర తోట్ల విద్యా సంస్థలను నెలకొల్పి పేదలు, అనాథలకు ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటుచేసి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ సంస్థల వ్యవస్థాపకులు డా జాకబ్ బీరా,జోసెఫ్ బీరా. మీరు ఇరువురు సోదరులు ఇద్దరిదీ ఒకటే సంకల్పం. పేదలందరూ చదువుకోవాలి. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన అందరూ చదువుకోవాలి అనేదే వీరి సంకల్పం. 30 ఏళ్లు అదే బాటలో పయనిస్తూ వేలాదిమంది అనాథ పిల్లలను చేరదీసి చదివించారు. ఈ విద్యాసంస్థల్లో చదువుకున్న అనేకమంది దేశ విదేశాల్లో మంచి స్థానాల్లో కొనసాగుతున్నారు. చేరదీసి చదువు నేర్పిన విద్యాసంస్థలను అప్పుడప్పుడు వారు సందర్శిస్తూ ఉంటారు. అటువంటి విద్యాసంస్థలు శనివారం 30వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను మండలంలోని సీతారాంపురంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆర్డీవో దాసిరాజు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఇంజనీర్లుగా, డాక్టర్లుగా స్థిరపడటమే కాకుండా అమెరికాలో కూడా ఈ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. జాకోబ్ బీరా, జోసెఫ్ బీరా లు విద్యారంగంలో చేస్తున్న సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు.

## నేడు, రేపు అన్ని విద్యాసంస్థలకు సెలవులు

**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 5వ తేదీ శనివారం బాబు జగజ్జీవన్ జయంతి, 6వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా ఏలూరు జిల్లాలో అన్నియజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒకప్రకటనలో తెలిపారు. పైన పేర్కొన్న ఉత్తర్వులు పాటించని అన్నియజమాన్య పాఠశాలలపైన శాఖాపరమైన చర్యలు తీసుకొనబడునుఅని తెలియచేస్తూ ఉత్తర్వులు మీ పరిధిలో అన్నియజమాన్య పాఠశాలలకు చేరేటట్లు తగిన ఆదేశాలు ఇవ్వవలని ఎంఈఓ లను కోరారు.

## బిసి కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు 566 మంది హాజరు:ఎంపీడీఓ



**ఆగిరిపల్లి, మేజర్‌న్యూస్:** బీసీ మరియు ఈబిసి కార్పొరేషన్ రుణాలకు 732మందికి అర్జీలు పెట్టగా,శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 566మంది హాజరైనట్లు ఎంపీడీఓ ఆనంద్ తెలిపారు.ఈ ఇంటర్వ్యూ లు పరిశీలించాటానికి బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు బిసి కార్పొరేషన్ సంక్షేమ అధికారి పుష్పలత విచ్చేసారు.ఈ కార్యక్రమంలో ఏవో అబ్దుల్ సలామ్, రుణాల అర్జీ దారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షురాలుగా గీతాంజలి ఏకగ్రీవం



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** భీమడోలు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షు రాలిగా కె.గీతాంజలి ఎంపికయ్యారు.కోర్ట్ ఆవరణలో భీమడోలు బార్‌అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యు లు ఇంజేటి విజయ అచ్యుతం ఆధ్వర్యంలో 2025 –26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో నూతన అధ్యక్షురాలితో పాటు ఉపాధ్యక్షులుగా కె. మోహన శ్రీనివాసరావ ు(వాసు), ప్రధాన కార్యదర్శిగా ఎస్ గోపాలకృష్ణ(గోపి), కోశాధికారిగా ఇంజేటి విజయ అచ్యుతం, కార్యదర్శిగా ఎల్ సుధారాణి, లైబ్రరీ అండ్ స్పోర్ట్స్ కార్యదర్శిగా లెనిన్, మహిళా ప్రతినిధిగా టి రాణి ఎన్నికయ్యారని నిర్వాహ కులు తెలిపారు.

## చేపల చెరువులో కోడి వ్యర్థాలు కలుపుతున్న ఇద్దరి అరెస్ట్

**భీమడోలు, మేజర్‌న్యూస్:** భీమడోలు రెవెన్యూ పరిధిలోని లింగం పాడు ఆవాస ప్రాంతంలో గల చేపల చెరువుకు నిషేధిత కోడి వ్యర్థాలను మేతగా తరలించి, దానిని చెరువులో కలిపే ప్రయత్నంలో ఉండగా భీమడోలు పోలీసులు ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం దాడి చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకున్నారు.

కోడి వ్యర్థాలను రవాణాకు వినియోగించిన మోటార్ వాహనాన్ని స్వాధీనపరుచుకున్నారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెదపాడు కు చెందిన కోరం ప్రకాష్, కూచిపూడి వాసు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కోళ్ళ వ్యర్థాలను సేకరించారు.

దీనిని చేపల మేతగా అందజేసేందుకు భీమడోలు చేరుకున్నారు. లింగంపాడు ఆవాస ప్రాంతంలో గల గంట మోహన్ రావుకు చెందిన చేపల చెరువులో తాము తీసుకువచ్చిన కోడి వ్యర్థాలను మేతగా వదులుతున్న నిందితులు ఇద్దరిని అదుపులోనికి తీసుకున్నారు. కేసును భీమడోలు ఎస్సై సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

# నూజివీడు - తిరుపతి లగ్జరీ బస్సులు ప్రారంభించిన అప్పల నాయుడు






**నూజివీడు,మేజర్ న్యూస్:** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించుటకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుందని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం నూజివీడు ఆర్టీసీ కాంప్లెక్స్ లో నూజివీడు నుండి తిరుపతికి వెళ్ళు రెండు సూపర్ లగ్జరీ నూతన బస్సును ఆయన ప్రారంభించారు. తొలుత ఆర్టీసీ కార్యాలయంలో బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన రెడ్డి అప్పల నాయుడుకి ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి రెండు సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు తమ గమ్య స్థానాలకు సుఖంగా సురక్షితంగా ప్రయాణం చేయాలనేది కూటమి ప్రభుత్వం సంకల్పమని అన్నారు.. దశల వారీగా కొత్త బస్సులను అన్ని డిపోల నుండి కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో గుంతల మయంగా ఉన్న రహదారుల్లో అనేక రహదారులను కూటమి ప్రభుత్వంలో గుంతలు లేని రహదారులుగా మార్చడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం రహదారులు అభివృద్ధికి సూచికలనీ ఆయన పేర్కొన్నారు.. తిరుపతికి నూతన బస్సుల ప్రారంభం ద్వారా పట్టణ ప్రజలు మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా, భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మికంగా ప్రయాణించగలరని ఆయన పేర్కొన్నారు.. ఇటువంటి సర్వీసుల్నీ రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిపో మేనేజర్ సి.హెచ్. పవన్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ జి.రాంబాబు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎమ్.వీ.రమణ,హైర్ బస్ ఓనర్స్ పీ.శరత్ బాబు,పీ.రామకృష్ణ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, స్టేట్ మీడియా కన్వీనర్ వేమూరి లక్ష్మీ గౌరీ,నూజివీడు నియోజకవర్గ టిడిపి నాయకులు పగడాల సత్యనారాయణ,మలిశెట్టి జగదీష్, తిరుమల శెట్టి ప్రదీప్,నాగరాజు, కొమ్మన విజయగౌరీ,జనసేన నాయకులు పాశం నాగబాబు, తోట వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్, దుర్గా ప్రసాద్, ఉమామహేశ్వరి, సూపరిం టెండెంట్, ఆర్టీసీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# వైఎన్ కళాశాలలో వర్క్ షాప్



**నర్సాపురం,మేజర్‌న్యూస్:**స్థానికశ్రీవై.యన్ కళాశాల హెచ్.ఆర్.డి.సెంటర్, ఐ.క్యూ.ఏ.సి ఆధ్వర్యంలో హాస్పిటల్ మేనేజ్మెంట్ ప్లేస్మెం ట్స్ పై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్, కు చెందిన జనరల్ మేనేజర్ హెచ్.కవురు రాధా మనోహర్ విచ్చేసి మాట్లాడుతూ వైద్యరం గంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అందుకు తగ్గట్టుగా మేనే జ్మెంట్ విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధిచేసుకుంటే ఉద్యోగ అవకాశాలు చేజిక్కించుకోవచ్చున్నారు. ఫైనాన్స్‌మేనేజ్మెంట్‌చదువుకునే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కలగాలంటే 'టాలీ' కోర్సు ను ఖచ్చితంగా విద్యలో భాగం కావాలని' అన్నారు .ఈ సందర్భం గా ప్రత్యేక అతిథిగా విచేసిన మెడ్ యునైటెడ్ హాస్పిటల్ కు చెందిన మార్కెటింగ్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ విజయ్ మాట్లాడుతూ మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ను త్వరలో పాలకొల్లులో ప్రారంభం కాబోతుందని తెలియ జేస్తూ అందులో ఉపాధి అవకాశాలను యం.బి.ఏ విద్యార్థులకు కలగ చేస్తామని వైద్యసేవలతో పాటు ఉపాధి అవకాశాలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని చెప్పారు.ఈఅవకాశాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌డా. సిహెచ్ కనకారావు ,కళాశాల డీన్ డా.గంధం శ్రీరామ కృష్ణ, యం.బి.ఏ విభాగాధిపతి డా.ఆర్ .పార్థసారథి ,హెచ్ ఆర్ డి సెంటర్ డైరెక్టర్ డా. సిహెచ్. శ్రీనివాస్,బి.ఎన్.ఎస్.వి.ప్రసాద్, మిస్‌గ్రంధి రూపాంజని శ్రీవాత్సవ,పి మారుతీరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

# మెగా డి.ఎస్.సి -2025కు ఉచిత ఆన్ లైన్ శిక్షణ

ఏలూరు,మేజర్ న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం బి.సి. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెగా డి.ఎస్.సి -2025 పరీక్షలకు టెట్‌లో అర్హత సాధించిన బి.సి,ఇ.డబ్ల్యూ.ఎస్ (ఇ.బి.సి) అభ్యర్థులకు ఉచిత ఆన్లైన్ డి.ఎస్.సి శిక్షణ కొరకు, ఇంటి వద్దనుంచే ఆన్లైన్ డి.ఎస్.సి కోచింగ్ ను పొందుటకు ఏలూరు జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, టిటిసి, బి.ఎడ్, కుల, ఆదాయ నివాస ధృవ పత్రములు,ఆధార్ కార్డ్, 2- పాస్ పోర్ట్ సైజ్ ఫోటోస్ ,టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బి.సి. సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా జిల్లా బి.సి. సంక్షేమం,సాధికారిత అధికారి,కలెక్టరేట్ కాంపౌండ్,ఏలూరు కార్యాలయములో సమర్పించా లన్నారు.రాష్ట్ర ప్రభుత్వంవారు కల్పించిన ఈ సదవకాశమును జిల్లా అభ్యర్థులు ఉపయోగించు కోవాలని బి.సి. స్టడీ సర్కిల్, ఏలూరు సంచాలకులు తెలిపారు. ఇతర వివరములకు ఫోన్: 8686180018 ద్వారా సంప్రదించవచ్చున్నారు.

# 3వ జోన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి

## - ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు



**అగిరిపల్లి,మేజర్ న్యూస్:** నూజివీడు బ్రాంచ్ కాలువ మండల పరిధి ఈదర గ్రామ శివారు 26.988 కిలోమీటర్ రెగ్యులేటర్ దగ్గర నీటి విడుదలను శుక్రవారం నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు పరిశీలిం చారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్‌కు తెలంగాణ ప్రభుత్వం సాగర్ జలాలను పూర్తిస్థాయిలో విడుదల చేసిన నేపథ్యంలో నూజివీడు బ్రాంచ్ కాల్వకు ఈ సీజన్ లో మొట్టమొదటిసారిగా 600 క్యూసెక్కులు విడుదల చేసిన నేపథ్యంలో ఈరోజు ఉదయం నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, నూజివీడు ఎన్.ఎస్.పి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. సీతారావమ్మ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ లు కొల్లి శ్రీనివాస్ రెడ్డి (రెడ్డి గూడెం), పామర్తి శ్రీనివాసరావు (నున్న) తదితరులు నూజివీడు బ్రాంచ్ 0.00 కి.మీ.నుండి 26వ కి.మీ. చివరి వరకు కాలువ వెంబడి నీటి విడుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ మన బోర్డర్ దగ్గరకు తెలంగాణ ప్రభుత్వం 1580 క్యూసెక్కులు విడుదల చేసిందని, అక్కడనుండి 117 కి.మీ. దగ్గర 1126 క్యూసెక్కులు డిశ్చార్జ్ రాగా, దిగువకు విడుదల చేస్తున్నామని,పైనుంచి వస్తున్న సాగర్ జలాలను క్రింద నీటి ఎద్దడి దృష్ట్యా నూజివీడు బ్రాంచ్ కాల్వకు 600 క్యూసెక్కులు సమన్వయం చేసుకొని ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ జిల్లా డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ దేవినేని సత్యన్నారాయణ (మడిచేర్ల), ఏలూరు జిల్లా డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ (మునునూరు), రెడ్డిగూడెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ యర్రా వెంకట శ్రీనివాసరావు, నున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఉప్పు వెంకటేశ్వరరావు, రామన్నగూడెం నీటి సంఘం అధ్యక్షులు పల్లగాని నాగేంద్రరావు, చంద్రాల నీటి సంఘం అధ్యక్షులు రాయల సాంబశివ రావు, ఎన్.ఎస్.పి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వి.జయరాజు, వై.నవీన్ బాబు, కే.ప్రసన్నకుమార్ వర్క్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ అలీ ఆయ కట్టు దారులు దాసరి తిరుపతిరావు, నర్రా వెంకటేశ్వరరావు, నల్లజాల హరిబాబు, నల్లూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్‌టిఎస్ఓ టాలెంట్ పరీక్షలో ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులు



**చింతలపూడి,మేజర్ న్యూస్ :** శ్రీ చైతన్య విద్యార్థులు ఐ.ఎన్.టి.ఎస్.ఓ సెకండ్ లెవెల్‌లో విశిష్ట ప్రతిభ కనపరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ టి.సురేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులలో 249 మంది వివిధ విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనపరచారని దానిలో భాగంగా ఒకరు మొదటి బహుమతి సయ్యద్ జోయా మాన్వాఇద్దరు రెండవ బహుమతి, ముగ్గురు మూడవ బహుమతి, నలుగురు నాలుగవ బహుమతి,నలుగురు ఐదవ బహుమతి, 8 మంది స్పెషల్ ప్రైజ్ ను, 93 మంది కన్సోలేషన్ బహుమతి, 26 మంది గోల్డ్ మెడల్, 108 మంది గోల్డ్ మెడల్ ,మెరిట్ సర్టిఫికెట్ సాధించి విజయకేతనం ఎగరవేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్.ఐ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ శ్రీ చైతన్యాలో అందించే ప్రత్యేక శిక్షణ వలన మాత్రమే విద్యార్థులు ఇంతటి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. చివరిగా బహుమతులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్స్ ఏ.జి.ఎం పార్థసారథి ,ఆర్.ఐ ఉదయభాస్కర్, కో-ఆర్డినేటర్.వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ.సురేష్, ఏ.వో రవీంద్ర, డీన్ .మధు బాబు, ప్రైమరీ ఇన్చార్జ్ ఝాన్సీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చవ్వాకుల చారిటబుల్ ట్రస్ట్ అధినేత నరేష్‌కు సత్కారం



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పాలకొల్లుకు చెందిన చవ్వాకుల నరేష్ ను రాజమండ్రి ఏ కె సి రోటరీ హాల్ నందు పాన్ ఇండియన్ సోఫియా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చవాకుల చారిట బుల్ ట్రస్టు ద్వారా సమాజానికి చేస్తున్నా సేవలకు గాను ఉగాది నంది పురస్కారం రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ అందజేసి ఘన సన్మానం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రాజా , అంతర్జాతీయ శ్రీ శ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రకాష్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు హరిక నర్స వల్లి , శ్రీ విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు చెరుకువాడ రంగ సాయి తదితరులు పాల్గొన్నారు

# పకడ్బందీగా 10వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం

## - అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం



**వీరవాసరం,మేజర్ న్యూస్:** వీరవాసరం ఎం.ఆర్.కె జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఈ నెల 3 నుంచి ప్రారంభమైన 10వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శు క్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా చుట్టుపక్కల జిల్లాల మినహా మిగతా జిల్లాల్లోని జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేందుకు జిల్లాకు పంపించడం జరిగింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ 10వ తరగతి జవాబు పత్రాలు మూల్యాంకనం పకడ్బందీగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి మూల్యాంకనాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. వివిధ జిల్లాలకు చెందిన 9 సబ్జెక్టులకు సంబంధించి 1,69,341 జవాబు పత్రాలు మన జిల్లాకు వచ్చాయన్నారు. 102 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 612 మంది సహాయ ఎగ్జామినర్స్, 204 మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తం 918 మంది జిల్లా విద్యాశాఖ అధికారి ఇ. నారాయణ పర్యవేక్షణలో జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసేందుకు నియమించడం జరిగిందన్నారు. మూల్యాంకనం ప్రక్రియ సుమారు వారం రోజులు పాటు కొనసాగుతుందని తెలిపారు. ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా మూల్యాంకనం ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని డీఈఓ ను ఆదేశించారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఈఓ ఇ.నారాయణ, తదితరులు ఉన్నారు.

# ప్రతి పేద వాడి సొంత ఇంటి కలను సాకారం చేస్తాం






– వీరమ్మ కుంటలో జరిగిన మీకోసం మీ చింతమనేని కార్యక్రమం

**పెదపాడు,మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గం పరిధిలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల వివరాల సేకరణ ప్రక్రియను ఇప్పటికే గ్రామాల్లో ముమ్మరం చేశామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మీ కోసం మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా వీరమ్మకుంట గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యేపర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి కాలంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ, కాలనీలు నిర్మిస్తామంటూ జగన్ ప్రభుత్వం దగా చేసిందని, నివాసయోగ్యం కాని ప్రాంతాలను కాలనీలుగా ఎంపిక చేసి భూసేకరణలో వైసిపి నాయకులు ఎన్నో అవకతవకలకు, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వంగయాగూడెం నుండి పెరికీడు వరకు ఉన్న రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో పేదలకు 3 సెంట్ల ఇంటిస్థలం అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చర్యలు తీసుకు న్నారని ఆయన తెలిపారు. జగన్ అండ్ కో దోచుకున్న ప్రభుత్వ సొమ్మును తిరిగి ఖజానాకు చేరేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత

– రూ 80 లక్షలతో సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే ,మాజీ ఎంపీ



**భీమవరం,మేజర్ న్యూస్:** గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామంలో రూ 38 లక్షలు,కొత్త పూసలమర్రు గ్రామం లో రూ.15 లక్షలు, దొంగపిండి గ్రామంలో రూ 11.70 లక్షలు ,తోకతిప్ప గ్రామంలో రూ.15 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. గ్రామస్తులు,కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

## 'సూర్య 'వార్తకు స్పందన - ఆర్పిన వీధిలైట్లు



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** నిత్యం వెలుగుతున్న వీధిలైట్లను పంచాయతీ సిబ్బంది పగలు వెలగకుండా అర్పారు. పగలే వెన్నెలాయె! అనే వార్త గురువారం సూర్య పత్రికలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధేయతమే.ఈ వార్తకు పంచాయతీ అధికార సిబ్బంది స్పందించారు. మరమ్మతులు చేసి వీధిలైట్లు పగలు వెలగకుండా చర్యలు తీసుకున్నామని పంచాయతీ కార్యదర్శి తెల్లం మోహన్ తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్‌కు రూ.940.71 కోట్లు కేటాయింపు

– ఎంపీ పుట్టా మహేష్‌కు కేంద్ర మంత్రి సమాధానం

**ఢిల్లీ/ ఏలూరు,మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు 2020-21లో కోవిడ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్యాకేజ్-1 కింద రూ.8473.73 కోట్లు, ఈ.సి.ఆర్.పి-2ద్వారా రూ.12,740.22కోట్లు, పీఎం-ఏ.బి.హెచ్.ఐ.ఎం ద్వారా 2022-23 నుంచి 2024-25 వరకు రూ. 4500.64 కోట్లు మంజూరు చేయగా, ఈ మూడు పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ కు రూ.940.71 కోట్లు కేటాయించినట్లు ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ తెలిపారు. గతంలో వచ్చిన మహమ్మారి కారణంగా ఏర్పడిన భారీ ఆర్థిక నష్టాలను తగ్గించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు,భవిష్యత్తులో వైద్యం, అత్యవసర మౌలిక సదుపాయాల సంసిద్ధత, పరిశోధకులు, నిపుణుల సంఖ్య, గత మూడేళ్లలో ఏపీకి కేటాయించిన నిధుల వివరాలు, ప్రజలకు అవగాహన కల్పించడానికి చేపట్టిన కార్యక్రమాలపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు ఆరోగ్య ,కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ శుక్రవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రత, వృద్ధుల కోసం పింఛన్లు,



ఆరోగ్య సదుపాయాల కల్పన,అల్పాదయ వర్గాల వారికి పక్క ఇళ్ల నిర్మాణం, ఆహార భద్రతవంటి చర్యలు తీసుకుందని, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు మౌలిక సదుపాయాలపై ఖర్చు పెంచిందని, ఫలితంగా 2021-22 నుంచి 2024-25 మధ్యదేశం సగటున 8.2 శాతం వృద్ధి సాధించిందని కేంద్ర మంత్రి తెలిపారు.

## అంబరాన్ని తాకిన ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు



**కైకలూరు,మేజర్ న్యూస్ :** కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 29వ వార్షికోత్సవ వేడుకలు కలిదిండిలోని అంగరంగ వైభవ ముగా నిర్వహించారు.ఈ సందర్భంగా జబర్దస్త్ కు చెందినటు వంటి వెంకి మంకీ,చిట్టి బాబు,ఫణి విచ్చేసి తమ యొక్క స్కిట్స్‌తో విద్యార్థులను వారి యొక్క తల్లిదండ్రులను అలరించారు. విద్యార్థులు వారిసాంస్కృతి కార్యక్రమాలు, కర్ర సాము, స్కిట్స్ ,కరాటేలలో నైపుణ్యమును ప్రదర్శించి తల్లిదండ్రులు అబ్బురపరిచినారు. కార్యక్రమాలను ఆద్యంతము ఎంతో ఆసక్తితో తల్లిదండ్రులు వీక్షించడం జరిగినది. సందర్భముగా వేడుకలకు విచ్చేసినటువంటి తల్లితండ్రులు మాట్లాడుతూ నైపుణ్యముతో అట్టహాసముగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించటం మరి ఎక్కడ చూడలేదు అని,అది ఒక్క కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కు మాత్రమే సాధ్యమని కొనియాడారు .వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఏ.శ్రీనివాసరావు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్న రావు టిడిపి నాయకులు జక్కుల విజయ్ కుమార్ సాంస్కృతిక కార్యక్రమాలను ఎంతో ఆసక్తితో తిలకించడం జరిగినది .ఈ సందర్భంగా కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ సానా వెంకట రామారావు , చైర్మన్ సానా మీనా సరస్వతి,శ్రీ కోన కేశవరావు మాట్లాడుతూ విద్యార్థులను చదువులలోనే కాకుండా అన్ని రంగాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలుగా నిలుస్తుందని కొనియాడారు.

# జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పించాలి

– డ్వామా అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం



**నరసాపురం,మేజర్ న్యూస్:** నరసాపురం మండలం వేములదీవి ఈస్ట్ నందు ఉపాధి హామీ పనులను, లక్ష్మణేశ్వరం హౌసింగ్ కాలనీని శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డిఓ దాసిరాజు, తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సమయంలో ఉపాధి కూలీలను జిల్లా కలెక్టర్ పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులకు ఇబ్బంది ఏమైనా ఉందా, అవసరమైన వారికి పనులు కల్పిస్తున్నారా, డబ్బులు సకాలంలో జమ అవుతున్నాయా, ఉపాధి హామీ పనులు లేనప్పుడు వ్యవసాయ పనులకు వెళ్తారా అని ప్రశ్నించి సమాధానాలను తెలుసుకున్నారు. పనిలో నాణ్యత తప్పకుండా ఉండాలని తెలిపారు.

– ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి లక్ష్మణేశ్వరం హౌసింగ్ లే అవుట్ ను పరిశీలించిన సందర్భంలో వివిధ నిర్మాణ దశలలో ఉన్న ప్రతి ఇంటిని సందర్శించి లబ్ధిదారులు ఎక్కడ ఉంటున్నారు, ఎందుకు నిర్మాణాలు పూర్తి కాలేదు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు అదనంగా 50 వేల రూపాయలను నిర్మాణాలకు అందజేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. లక్ష్మణేశ్వరంలో 93 ప్లాట్లను కేటాయించి, 85 గృహాలను మంజూరు చేయడం జరిగిందని,ఇప్పటివరకు 47 గృహాలు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. మూడు గృహాలు రూఫ్ కాస్ట్ లెవెల్ లోను,నాలుగు రూఫ్ లెవెల్ లోను, 12 లింటెల్ లెవెల్ లోను,15 బిఎల్ లెవెల్ లోను ఉన్నాయని తెలిపారు. ఈసందర్భంలో కాలనీలో ఇప్పటికే నివాసం ఉంటున్న కొందరు మహిళలు జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ కాలనీకి రాకపోకలు సాగించే ఒక దారిని ఫెన్సింగ్‌తో మూసివేయడం కారణంగా నడకదారికి ఇబ్బందిగా ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్డీవోను ఆదేశించారు. కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, తదితర సమస్యలు ఉన్నాయని నివాసితులు కలెక్టర్ కు విన్నవించడం జరిగింది.

ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, డ్వామా పిడి డాక్టర్ కే సిహెచ్ అప్పారావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఇంచార్జ్ తహాసిల్దార్ ఐవి వి సత్య నారాయణ,ఎంపీడీవో జీవీఎస్ కృష్ణంరాజు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, డ్వామా ఏపీవో శ్రీనివాస్,గృహ నిర్మాణశాఖ ఈఈ ఎం.శ్రీనివాస్, డిఈ ఆర్.త్రిమూర్తులు, తదితరులు ఉన్నారు.